

# మహాగర్జనను తలపించిన రజతోత్సవం

## తెలంగాణ స్వర్ణకాంతులకు ప్రతినబూనిన బీఆర్ఎస్ దళం

## గుండెగుండెలో ప్రతిధ్వనించిన గులాబీనాదం.. మేడారం జాతరలా పోటెత్తిన కేతనం

(ఎల్కతుర్తి నుంచి నమస్తే తెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్): ఓరుగల్లు తెలంగాణ గొంతుకై గర్జించింది. జనపోరు కెరటమై హోరెత్తింది. రాష్ట్ర సాధన ఉద్యమంలో 2010 డిసెంబర్ 16న ఇదే వరంగల్ వేదికగా బీఆర్ఎస్ పార్టీ నిర్వహించిన 'తెలంగాణ మహాగర్జన'ను తలపించేలా ఆదివారం ఎల్కతుర్తి వేదికగా బీఆర్ఎస్ రజతోత్సవ ప్రతినబూనింది. మండుటెండను సైతం లెక్కచేయక లక్షలాదిగా తరలివచ్చిన జనసంద్రం ఏనాటికైనా తెలంగాణకు రక్షణ కవచం బీఆర్ఎస్సేనని తేల్చిచెప్పింది. అశేష జనవాహిని, ఉప్పొంగిన జనసందోహాన్ని చూసిన పార్టీ అధినేత కేసీఆర్ ఉద్విగ్నభరితులయ్యారు. తెలంగాణ రాష్ట్ర సాధన మినహా తనకేవీ ప్రీతిపాత్రమైనవి కావని, అదే తనకు వెయ్యి జన్మల పుణ్యఫలమని పేర్కొనప్పుడు ఒకింత గద్గద స్వరంతో ఉన్నా... గడచిన 17 నెలలుగా తెలంగాణకు జరుగుతున్న అన్యాయంపై ఉగ్రరూపం దాల్చారు. దసరా పండుగనాడు పాలపిట్టను చూసినట్టు.. జమ్మికొమ్మను తాకినట్టు బహిరంగ సభా వేదిక మీద గులాబీ నాయకగణమే కాదు.. సభాప్రాంగణంలో ఉన్న ప్రతీ ఒక్కరూ కేసీఆర్‌ను చూసి పులకించిపోయారు. ఆయన చెప్పిన మాటలను చెవులొగ్గి విన్నారు. సందర్భం వచ్చినప్పుడల్లా ప్రతిస్పందించారు. ఎల్కతుర్తి చుట్టూ దాదాపు 20 కిలోమీటర్ల పరిధి వరకు బీఆర్ఎస్ రజతోత్సవ శోభ సంతరించుకున్నది. వరంగల్, హనుమకొండ, కాజీపేట, స్టేషన్‌ఘన్‌పూర్, నర్సంపేట, జనగామ, వర్ధన్నపేట, పరకాల, హుజూరాబాద్, హుస్నాబాద్ వయా ముల్కనూర్ దాకా ఉన్న చౌరస్తాలన్నీ గులాబీమయం అయ్యాయి. పార్టీ అధినేత కేసీఆర్, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్టీ ముఖ్య నేత హరీశ్‌రావు సహా ఆయా నియోజకవర్గాల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు పార్టీ ముఖ్యనేతల ఫొటోలతో భారీ కటౌట్లు ఏర్పాటు చేశారు. ఇక సభా ప్రాంగణంలో గులాబీవనంలా జనసందోహం విరబూసింది.



### కండ్లు చెదిరే ఏర్పాట్లు- మినీ టెక్నోహబ్

భారీ బహిరంగ సభలు నిర్వహించటంలో బీఆర్ఎస్ ట్రెండ్ సెట్టర్. రజతోత్సవ ఏర్పాట్లను చూస్తే అదే నిజమని మరోసారి తేలిపోయింది. ఎల్కతుర్తి బహిరంగ సభకు లక్షలాదిగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా అసాధారణ ఏర్పాట్లు చేశారు. దాదాపు నెల రోజుల నుంచి పార్టీ ముఖ్యనేతలే కాకుండా దాదాపు వెయ్యి మంది గులాబీ సైన్యం కష్టపడి చేసిన ఏర్పాట్లకు ఫలితం దక్కిందనే చెప్పాలి. రాష్ట్ర నలుమూలల వచ్చే వాహనాల రూట్‌మ్యాపింగ్, అక్కడి నుంచి తిరిగి వెళ్లేప్పుడు పూర్తి సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించటంతో ఎటువంటి ఇబ్బంది ఎదురుకాలేదు. ట్రాఫిక్‌జాం కాకుండా క్రౌడ్ కంట్రోల్ మేనేజ్‌మెంట్ కోసం క్రెయిన్స్‌నూ సిద్ధం చేసుకోవటం విశేషం. 'మినీ కమాండ్ కంట్రోల్' సెంటర్ నుంచి సంబంధిత రూట్లలో ఉన్న వలంటీర్స్‌కు సమాచారం ఇచ్చేందుకు చేసిన ఏర్పాట్లు విజయవంతమయ్యాయి. అలాగే సభా ప్రాంగణం చుట్టూ ఏర్పాటు చేసిన భారీ ఎల్ఈడీ (50*20) స్క్రీన్లతోపాటు ముల్కనూర్, హుజూరాబాద్, హనుమకొండ ప్రధాన రహదారులవైపే కాకుండా పార్కింగ్ స్థలాల్లోనూ మీడియం ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేయటం వల్ల ఎక్కడిక్కడ ఉన్నవారికి సౌకర్యవంతమైంది. ఇక సభాప్రాంగణం.. మహానగరాన్ని తలపించేరీతిలో మిరమిట్లు గొలిపేలా వెలుగులు విరజిమ్మాయి.

### అనేక ప్రశ్నలకు సమాధానాలు..

ఎల్కతుర్తి సభా ప్రాంగణం నుంచి కేసీఆర్ అనేక ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు చేస్తున్న మోసాన్ని, ద్రోహాన్ని చీల్చిచెండాటంతోపాటు అధికార కాంగ్రెస్ పార్టీ పదే పదే కేసీఆర్ ఎక్కడున్నారంటూ చేస్తున్న వ్యాఖలకు దీటుగా సమాధానం చెప్పారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కొత్తలో ఏమి మాట్లాడొద్దని కొంత కాలం ఓపిక పట్టామని ఇక సహించేది లేదని ప్రకటించారు. మరోవైపు బీజేపీపై కేసీఆర్ తనదైన శైలిలో విరుచుకుపడ్డప్పుడు జనం నుంచి అదే స్పందన వచ్చింది. కేసీఆర్ ఇన్నాళ్లుగా ఎందుకు మౌనంగా ఉన్నారన్న ప్రశ్నకు కూడా ఆయనే సమాధానం ఇచ్చినట్టయ్యింది.

### రజతోత్సవం.. రణ సంతకం

**బీఆర్ఎస్** రజతోత్సవ సభ విజయవంతమైంది. ఊహించిన దానికంటే అశేషంగా జనవాహిని తరలిరావడంతో గ్రాండ్ సక్సెస్ అయింది. కిక్కిరిసిన సభ ప్రాంగణం రాష్ట్ర ప్రభుత్వంపై రణ సంతకం చేసింది. అధినేత కేసీఆర్ రణనినాదం చేశారు. కాంగ్రెస్, బీజేపీలపై సింహగర్జన చేశారు. తెలంగాణ ప్రజల పరిరక్షణకు బీఆర్ఎస్ పునరంకితం అవుతుందని పోరాట ప్రతిజ్ఞ చేశారు. అదేసమయంలో ఎట్లున్న తెలంగాణ.. ఎట్లాయిపాయేనని ఆవేదన చెందారు. మరోవైపు రెట్టించిన ఉత్సాహంతో బీఆర్ఎస్ అధికారంలోకి వస్తుందని అభయమిచ్చారు. ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని, అన్ని విధాలుగా తెలంగాణను బాగు చేసుకుందామని భరోసా ఇచ్చారు. ఇక నుంచి జనంలోకి వస్తానని తేల్చిచెప్పారు. కేసీఆర్ ప్రసంగిస్తున్నసేపు సీఎం.. సీఎం అని ప్రజలు నినాదాలు చేస్తూనే ఉన్నారు. సోషల్‌మీడియా వారియర్స్‌పై కేసులు పెడతారా? అని కేసీఆర్ నిలదీస్తున్నప్పుడు సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది. డైరీలో రాసి పెట్టుకుంటామని కేసీఆర్ చెప్పగానే.. రాసిపెట్టుకోవాలి.. రాసిపెట్టుకోవాలి.. అని నినదించారు.



# ఎల్కతుర్తిలో గులాబీ 'ప్రభంజనం'

- ఎంతనుకొన్నారో.. అంతకుమించి వచ్చారు
- బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనసునామీ
- అంచనాకు మించి వచ్చిన యువత, మహిళలు
- హెడ్‌కౌంట్ 8.5 లక్షలు ఉందన్న ఔట్‌లేయర్
- డ్రోన్ విజువల్స్ సాయంతో లెక్కతేల్చిన ఏఐ
- 10 లక్షల కంటే ఎక్కువగా వచ్చారన్న 'గ్రోక్'
- 15 లక్షలు దాటారంటూ నెటిజన్ల కామెంట్స్

(స్పెషల్ టాస్క్ బ్యూరో)

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ రజతోత్సవ సభకు ప్రజల నుంచి ఊహించిన దానికంటే మించిన స్పందన వచ్చింది. తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రసంగాన్ని ప్రత్యక్షంగా వినడానికి సభాప్రాంగణానికి లక్షలాది మంది ప్రజలు పోటెత్తారు. సభలోని జనాల డ్రోన్ విజువల్స్ చూసి టీవీల ముందు కూర్చున్న ప్రతీఒక్కరూ ఆశ్చర్యానికి గురయ్యారు. 8 లక్షల మంది రావొచ్చని కొందరంటే, 10 లక్షల మంది వచ్చారని మరికొందరు, 15 లక్షల మంది దాటారని ఇంకొందరు ఎవరికి వారు లెక్కలేసుకొన్నారు. ఇదే విషయమై ఏఐ టూల్స్, చాట్‌బాట్‌లను ప్రశ్నిస్తే, బీఆర్ఎస్ సభకు తక్కువలో తక్కువ 8.5 లక్షల నుంచి 10 లక్షల మందివరకు వచ్చినట్టు తేల్చాయి.

### టెక్నికల్ లెక్కల ప్రకారం

బీఆర్ఎస్ సభకు ఎంతమంది వచ్చారన్న విషయాన్ని సాంకేతికంగా తెలుసుకోవడానికి ఏఐ టూల్ ఔట్‌లేయర్ ఏఐను కొందరు నెటిజన్లు వినియోగించారు. సభలోని జనం డ్రోన్ వీడియోలు, ఫొటోలను అప్‌లోడ్ చేశారు. ప్రత్యేక సాఫ్ట్‌వేర్ టూల్ ద్వారా ఒక్కో మనిషిని (హెడ్ కౌంట్) గ్రీన్ మార్క్‌గా చేసుకొని లెక్కించడం మొదలు పెట్టిన ఔట్‌లేయర్.. ఆదివారం సాయంత్రం 6.50 గంటలకు సభాప్రాంగణంలో 8.5 లక్షల మంది ఉన్నట్టు తేల్చింది. డ్రోన్ విజువల్స్‌లో కవర్ అయిన ప్రాంతాన్ని బట్టి ఈ సంఖ్యను చెప్పింది. అప్పటికే సుమారు లక్షన్నర మంది ఇంకా సభాప్రాంగణానికి చేరుకోలేకపోయారని కేసీఆర్ తన ప్రసంగంలో చెప్పారు. ఇక సభకు హాజరైన జనం గురించి ఏఐ చాట్‌బాట్ 'గ్రోక్'ను ప్రశ్నించగా 10 లక్షల కంటే ఎక్కువ మంది వచ్చారని బదులిచ్చింది. సభతో పాటు, సభాప్రాంగణం బయట ఉన్నవారు, కాంగ్రెస్ సర్కారు అడ్డగింతతో ఎల్కతుర్తి దగ్గరి వరకు వచ్చి ఆగిపోయిన వారితో కలుపుకొంటే సభకు మొత్తంగా 15 లక్షల కంటే ఎక్కువ మందే వచ్చి ఉంటారని నెటిజన్లు పోస్టులు పెట్టారు. కాగా సభకు 10 లక్షల మందివరకు వస్తారని బీఆర్ఎస్ నేతలు, శ్రేణులు అంచనా వేసుకుంటే.. అంతకుమించి జనం తండోపతండాలుగా వచ్చారంటూ సోషల్‌మీడియాలో కామెంట్లు వెల్లువెత్తాయి.

# కేసీఆర్ వెంటే తెలంగాణ

- అన్ని వర్గాలు బీఆర్ఎస్ వైపే
- ఎల్కతుర్తిలో ఎటుచూసినా జనమే
- భారీగా తరలివచ్చిన రైతులు
- మహాసభలో అధికంగా మహిళలే
- రజతోత్సవంలో యువత సందడి



వరంగల్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): అన్నదాతలు, మహిళలు, యువత, విద్యార్థులు... ఇలా వర్గాల ప్రజలు బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు తరలివచ్చారు. సైకిల్, ఎండ్లబండి, మోటరు సైకిల్, ఆటో, కారు, టాటాఏస్, వ్యాను, బస్సు... వాహనం ఏదైనా, అన్నీ ఎల్కతుర్తికే చేరాయి. అనుకున్నట్టుగానే ఎవరికి వారుగా బయలుదేరి మహాసభలో కలుసుకున్నారు. ఇంటి పెద్దాయన, ఇల్లాలు, ఉద్యోగం చేసే కొడుకు, చదువుకునే బిడ్డ... తెలంగాణ రాష్ట్రాన్ని దిక్సూచిగా నిలిపిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ప్రసంగం వినేందుకు అందరూ ఎల్కతుర్తికి చేరారు. ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, శ్రేణులు, తెలంగాణవాదులు, కేసీఆర్ అభిమానులు లక్షలాదిగా తరలి వచ్చిన జనంతో ఎల్కతుర్తి కిటకిటలాడింది.

### అన్నదాతల దారి

బీఆర్ఎస్ మహాసభకు ఊరూరా అన్నదాతలు తరలివచ్చారు. సభలో రైతులే ఎక్కువ మంది కనిపించారు. ప్రతి పల్లె నుంచి రైతులు ఉత్సాహంగా సభకు వచ్చారు. బీఆర్ఎస్ మొదటి నుంచి రైతుల పక్షాన నిలబడింది. కేసీఆర్ హయాంలోనే రాష్ట్రంలో సాగు బాగైంది. 16 నెలలుగా కాంగ్రెస్ పాలనలో అన్నదాతలు ఆగమవుతున్నారు. బీఆర్ఎస్‌తోనే భరోసా ఉంటుందని అన్నదాతలు అధిక సంఖ్యలో వచ్చారు. కేసీఆర్ హయాంలో సాగునీరు, కరెంటు, పంటలకు ధర ఉన్నదని గుర్తుచేసుకున్నరు. కేసీఆర్ ప్రసంగంతో వ్యవసాయంపై ధీమా పెరిగిందని చెప్పుకున్నారు. 'కేసీఆర్ ఉన్నప్పుడు ఎవుసం బాగుండె. ఇప్పుడు నీళ్లు వస్తలేవు. పంటలు పండలే. బోనస్ లేదు, ధర లేదు. మళ్ల కేసీఆర్ వస్తనే రైతులు మంచిగుంటరు' అని కరీంనగర్ జిల్లా జమ్మికుంటకు చెందిన సత్యనారాయణ చెప్పారు.

### సగం మంది మహిళలే

సభకు వచ్చిన వారిలో సగం మంది మహిళలే ఉన్నారు. మహిళా సంక్షేమం, కుటుంబ అవసరాలను తీర్చిన పార్టీగా మహిళల్లో బీఆర్ఎస్‌కు ఉన్న ఆదరణ ఎల్కతుర్తి సభతో తెలిసిపోయింది.'బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన పథకాలతో అన్ని కుటుంబాలు బాగున్నయి. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. బిడ్డ పెండ్లి చేసి ఏడాది అయినా కల్యాణలక్ష్మి వస్తలేదు. కాన్పు సుత అయ్యింది. దవాఖానలో అప్పుడు మా పెద్ద బిడ్డకు కేసీఆర్ కిట్ ఇచ్చిండ్రు. సర్కారు దవాఖానలో కాన్పుకు పోదామంటే మా వాళ్లు అప్పటి లెక్కలేదు వద్దన్నరు. కేసీఆర్ ఉన్నప్పుడు అన్ని మంచిగుండె. ఇప్పుడు తెర్లయింది' అని వరంగల్‌లోని పోచమ్మమైదాన్‌కు చెందిన నీలగిరి రాజమణి చెప్పారు.

### సండే యూత్ జోష్

సభలో సగం కంటే ఎక్కువగా యువత ఉన్నారు. కేసీఆర్ ప్రసంగం వినేందుకు హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి యువత, విద్యార్థులు ఉత్సాహంగా సభకు వచ్చారు. రాజకీయాలకు దూరంగా ఉంటారనే అభిప్రాయాన్ని చెరిపివేస్తూ సభకు వచ్చిన మహిళల్లో ఎక్కువ మంది యువతులు ఉన్నారు. ఆదివారం కావడంతో ఉద్యోగాలు చేసే వారు, యువత ఎక్కువ మంది ఓ ట్రిప్‌లాగా ఎల్కతుర్తి సభకు వచ్చిన పరిస్థితి కనిపించింది. 'బీఆర్ఎస్ అంటే ఎమోషన్. మేం క్యాంపస్‌లో ఉన్నప్పుడు ఉద్యమ సభలు మిస్ కాలేదు. ఆ తర్వాత రాష్ట్రం వచ్చి మంచిగా అభివృద్ధి చెందింది. బీఆర్ఎస్ మీటింగ్ మళ్లీ కొత్త ఆశలు తెచ్చింది. అప్పటి బ్యాచ్ వాళ్లం ఫోన్లలో అనుకుని మొత్తం మీటింగ్‌కు వచ్చినం. బీఆర్ఎస్ సభ అప్పటి ఉద్యమ రోజులను గుర్తుకు తెచ్చింది' అని హైదరాబాద్‌లోని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కోల శ్రీనివాస్ పాత రోజులను గుర్తుకు తెచ్చారు.

### ఆటోవాలా చలో..

కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలతో తీవ్రంగా నష్టపోయిన వర్గాలు భరోసా కోసం బీఆర్ఎస్ సభకు తరలివచ్చాయి. ఆటో యజమానులు, డ్రైవర్లు స్వచ్ఛందంగా ఆటోల్లో ప్రజలను తీసుకుని బీఆర్ఎస్ సభకు వచ్చారు. అసంఘటితంగా ఉన్న ఆటోవాలాల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో చేసిందని, ప్రస్తుత ప్రభుత్వం తమ గురించి ఆలోచించకుండా వ్యవహరిస్తున్నదని ఆటోవాళ్లు వాపోయారు. 'ఉచిత బస్సు పథకాన్ని తప్పుబట్టడం లేదు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్న రోజుల్లో మా జీవితాలు బాగుండె. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక మాకు అన్యాయం మొదలైంది. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం స్పందించాలి. బీఆర్ఎస్ మాకు ఎప్పుడూ అండగా ఉన్నది. ఉద్యమం రోజుల నుంచి మాతో కలిసి నడిచింది' అని హైదరాబాద్‌కు చెందిన లావుడ్యా రాజునాయక్ పేర్కొన్నారు.

# అడ్డంకులు సృష్టించినా అంచనాలకు మించి జనం

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): సునామీ అంటే ఎట్ల ఉంటదో మనం సముద్రంలో చూశాం.. కానీ, ఇప్పుడు జనసునామీ ఎట్ల ఉంటదో ఎల్కతుర్తిలో చూశాం. చీమలదండులా కదిలిన గులాబీ సైనికులు బీఆర్ఎస్ రజతోత్సవ సభకు జనజాతరలా కదిలివచ్చారు. కేసీఆర్ సభలంటేనే ఆషామాషీ కాదు.. పార్టీ రజతోత్సవ వేళ... దీంతోపాటు ఏడాది తర్వాత తమ నాయకుడు బహిరంగ సభకు వస్తారంటే గులాబీ కార్యకర్తలు, తెలంగాణవాదుల్లో ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చు. సభలు నిర్వహించడంలో దేశ రాజకీయ చరిత్రలో మరో రికార్డును కేసీఆర్ సృష్టించారు. ఎల్కతుర్తిలో ఆదివారం నిర్వహించిన సభ అత్యధిక ప్రజలు హాజరైన రాజకీయ సభగా రికార్డులకెక్కనుంది. గతంలో 2010లో వరంగల్‌లో నిర్వహించిన సభ కంటే ఈసారి ఎక్కువమంది హాజరైనట్టు రాజకీయ విశ్లేషకులు చెప్తున్నారు. రాష్ట్రం నలువైపుల నుంచి పోటెత్తిన జనంతో హనుమకొండ, వరంగల్, కరీంనగర్, సిద్దిపేట వైపు ఉన్న రహదారులన్నీ ట్రాఫిక్‌జాంతో కిక్కిరిసిపోయాయి. లక్షలాది మంది పార్టీ కార్యకర్తలు, కేసీఆర్ అభిమానులు ట్రాఫిక్ జాంలో ఇరుక్కొని ఇక చేసేది లేక మొబైల్ ఫోన్లలోనే యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో తమ అభిమాన నేత ప్రసంగాన్ని చూడటం రోడ్ల పక్కన కనిపించింది. మధ్యాహ్నం ఒంటిగంటకే సభా వేదిక ముందువేసిన కుర్చీలన్నీ నిండిపోయాయి. ఇక మూడున్నరలోపే పార్కింగ్ ప్రాంతాలన్నీ కిక్కిరిసిపోయాయి. ప్రజలు భారీగా వచ్చేయడంతో వేదిక నిర్వాహకులు కేసీఆర్‌కు సమాచారం ఇచ్చారు. దీంతో కేసీఆర్ కూడా తొలుత అనుకున్న సమయానికి ముందే బయల్దేరి సభకు వచ్చారు. వచ్చిన తర్వాత కొంత సేపు సభకు వచ్చిన ముఖ్యులతో భేటీ అయ్యారు. ఇంకా జనం ట్రాఫిక్‌లోనే చిక్కుకున్నారని వేదికపై నుంచి మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ప్రకటించారు. వేదిక వద్దకు వారు చేరుకోవడానికి సహకరించాలని పోలీసులను, వలంటీర్లను కోరారు.

### జనసంద్రమే..

కేసీఆర్ వేదిక వద్దకు వచ్చే సమయానికే సభాస్థలి నిండిపోయింది. కేసీఆర్ రావడం చూసి ఒక్కసారిగా కేసీఆర్‌కు అనుకూలంగా నినాదాలు చేశారు. కిలోమీటర్ల దూరంలో ఉన్నవారు కూడా పరిగెత్తుకొని వచ్చారు. కేసీఆర్ ప్రసంగం మొదలు పెట్టే సమయానికి 1300 ఎకరాల సభాస్థలం కాలు పెట్టే సందులేకుండా జనంతో నిండిపోయింది. సభ ముగిసిన తర్వాత వేదిక వద్ద నుంచి మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఇతర ముఖ్య నేతలు బయటకు వచ్చేందుకు గంటలకొద్ది సమయం పట్టింది. సభకు వచ్చిన వారు ప్రాంగణం నుంచి బయటకు వెళ్లేందుకు అర్ధరాత్రి వరకు గంటల సమయం వేచిఉండాల్సి వచ్చింది.

### ఎన్నికలు లేవు.. ఉద్యమ సమయం కాదు..

సాధారణంగా ఎన్నికలప్పుడు సభలు పెట్టడం రాజకీయ పార్టీలకు రివాజు. ఆ సభలకు భారీ ఎత్తున జనసమీకరణ చేస్తుంటారు. కానీ, రాష్ట్రంలో ఇప్పుడు ఎలాంటి ఎన్నికలు లేవు. పైగా నడివేసవి. ఎండలు 40 డిగ్రీలను తాకుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో కార్యకర్తలే కాకుండా ఇంత మంది జనం స్వచ్ఛందంగా కదిలిరావడం కేసీఆర్‌పై ఉన్న క్రేజ్‌కు, బీఆర్ఎస్ పార్టీపై ఉన్న అభిమానానికి నిదర్శనం. ఎన్నికలప్పుడు పార్టీ కార్యకర్తలను సమీకరించి సమావేశాలు పెడుతుంటారు. కానీ, ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా కదిలివచ్చారు. తెలంగాణ ఉద్యమ సమయంలో ఉద్యమం పట్ల ఉన్న నిబద్ధత, ఆకర్షణ, సంఘీభావం తెలపాలన్న లక్ష్యంతో ప్రజలు ఎక్కడ సభలు పెట్టినా వచ్చేవారు. కానీ, ఇది ఉద్యమ సందర్భం కూడా కాదు. అయినా లక్షలాదిగా ప్రజలు తరలివచ్చారు.



అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కేటీఆర్ తదితరులు

# బీఆర్ఎస్ ప్రస్థానానికి ఆ ఇద్దరే మూల స్తంభాలు

- పార్టీకి కొండా లక్ష్మణ్, ప్రొ.జయశంకర్ స్ఫూర్తి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్
- వరంగల్ సభకు బయలుదేరే ముందు కొండా విగ్రహం, అమరుల స్థూపం వద్ద నివాళులు
- తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జెండా ఆవిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమానికి, బీఆర్ఎస్ పార్టీ ప్రస్థానానికి ఉద్యమ నేత కొండా లక్ష్మణ్ బాపూజీ, ప్రొఫెసర్ జయశంకర్ సారే స్ఫూర్తి అని, వారే మూల స్తంభాలు అని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. 25 ఏండ్ల పార్టీ ప్రస్థానానికి, ఆ ఇద్దరి స్ఫూర్తితో పాటు కేసీఆర్ అందించిన నాయకత్వమే ప్రధాన కారణమని తెలిపారు. ఆదివారం ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభకు బయలుదేరే ముందు తెలంగాణభవన్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి కేటీఆర్ దండం పెట్టారు. శాసనమండలో ప్రతిపక్ష నేత మధుసూధనాచారి, పొన్నాల లక్ష్మయ్య, కార్యకర్తలతో కలిసి బీఆర్ఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం తెలంగాణ అమరవీరుల స్థూపం వద్ద, ట్యాంక్‌బండ్ వద్ద ఉన్న కొండా లక్ష్మణ్ బాపూజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. తెలంగాణ ఏర్పాటు కోసం ప్రాణాలర్పించిన అమరవీరులందరికీ తలవంచి వినమ్ర నివాళులు అర్పిస్తున్నామని తెలిపారు. అమరవీరుల అశీస్సులు, పెద్దల ఆశీర్వాదాలతో మరో 25 ఏండ్లు తెలంగాణ సమాజానికి సేవచేసే అవకాశం లభిస్తుందని ఆశిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్, ఎమ్మెల్సీలు నవీన్‌రెడ్డి, దాసోజు శ్రవణ్, మాజీ ఎమ్మెల్యే నరేందర్‌రెడ్డి, పార్టీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

### 'బీఆర్ఎస్ 25 ఏండ్ల సంబురం' పుస్తకాన్ని ఆవిష్కరణ

బీఆర్ఎస్ 25 ఏండ్ల సంబురం పేరుతో రూపొందించిన పుస్తకాన్ని తెలంగాణ భవన్‌లో కేటీఆర్ ఆదివారం ఆవిష్కరించారు. ఈ పుస్తకాన్ని సీనియర్ పాత్రికేయులు కోటిరెడ్డి, బాలకృష్ణ, మాలతి, తేజ రూపొందించారు. తెలంగాణ ఉద్యమ కాలం నుంచి అధికారంలోకి వచ్చేంత వరకు జరిగిన ఉద్యమ ఘట్టాలను పుస్తకంలో పొందుపరిచారు.

# తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుంది: కేటీఆర్

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): హనుమకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించిన బీఆర్ఎస్ రజతోత్సవ సభ తెలంగాణ చరిత్రలో నిలిచిపోతుందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభివర్ణించారు. సభకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేసిన ప్రతి ఒక్క బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా ఆదివారం తన ఎక్స్ వేదికగా ఆయన ధన్యవాదాలు తెలిపారు.'తెలంగాణ నలుమూలల నుంచి తరలివచ్చి ఈ సభను విజయవంతం చేశారని కొనియాడారు.




# ఉద్యమాల పురిటిగడ్డ ఓరుగల్లు

- సభకు తరలివచ్చిన నేతలు, ప్రజలకు స్వాగతం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

హైదరాబాద్, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): ఓరుగల్లు అంటేనే ఒక చరిత్ర అని, తెలంగాణ ఉద్యమానికి అది పురిటిగడ్డ అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పేర్కొన్నారు. ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ రజతోత్సవ సభలో సభా వేదికపై నుంచి ఆయన స్వాగతోపన్యాసం చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు రజతోత్సవం సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. ప్రొఫెసర్ జయశంకర్ జన్మించిన నేల ఇది అని పేర్కొన్నారు. వరంగల్‌లో భారీ బహిరంగ సభలు పెట్టి విజయవంతం చేయడం బీఆర్ఎస్‌కే సాధ్యమని తెలిపారు. 2003, 2018లో జరిగిన బీఆర్ఎస్ గర్జనల తర్వాత జరుగుతున్న సభ ఇదేనని గుర్తుచేశారు.

# చేర్యాల మీదుగా కేసీఆర్ పయనం

- బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్తేజం
- మంగళ హారతులతో ఘన స్వాగతం

చేర్యాల, ఏప్రిల్ 27 : ఎల్కతుర్తిలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ రజతోత్సవ సభకు హాజరైన పార్టీ అధినేత కేసీఆర్ తిరుగు ప్రయాణంలో రాత్రి రోడ్డు మార్గం ద్వారా బస్సులో ప్రయాణించారు. ఈ క్రమంలో కేసీఆర్ జనగామ నియోజకవర్గంలోని తరిగొప్పుల మండల కేంద్రం మీదుగా నర్మెట్ట, మద్దూరు మండలం లద్నూరు, మద్దూరు మండల కేంద్రం నుంచి చేర్యాల మండలం ముస్త్యాల, చేర్యాల పట్టణం మీదుగా వేచరేణి, కొమురవెల్లి మండల కేంద్రం నుంచి ఐనాపూర్, పోసాన్‌పల్లి మీదుగా రాత్రి పొద్దుపోయిన తర్వాత తన వ్యవసాయ క్షేత్రానికి చేరుకున్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చేర్యాల ప్రాంతంలోని వివిధ మండలాల గుండా వస్తున్నారని విషయం తెలియడంతో పెద్ద ఎత్తున పార్టీ శ్రేణులు గ్రామాల్లో రోడ్లపైకి మంగళహారతులతో వచ్చి రెడీగా ఉన్నారు. చేర్యాలకు కేసీఆర్ చేరుకోగానే పార్టీ నాయకులు, కార్యకర్తలు పటాకులు పేల్చి స్వాగతం పలికారు. బస్సులో ప్రయాణిస్తున్న సమయంలో కేసీఆర్ రోడ్డు మార్గంలో వెళ్తూ ప్రజలను గమనిస్తూ ఆయా గ్రామాల ప్రజలకు అభివాదం తెలియజేస్తూ ప్రయాణించడంతో ప్రజలు ఎంతో సంబురపడ్డారు. కాన్వాయ్‌లో కేసీఆర్‌తో పాటు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి సైతం ఉండటంతో కార్యకర్తల్లో మరింత జోష్ నెలకొంది.